## క్లుప్తంగా

### సీఎంను కలిసిన జూపల్లి అరుణ్



కొల్లాపూర్: రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తనయుడు జూపల్లి అరుణ్ ఆదివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలని కోరారు.

### సౌండ్‌బాక్స్‌కు విరాళం



కోడేరు: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు పాడేళ్ల సురేష్ ఆదివారం మండల కోఆప్షన్ మెంబర్ అబ్దుల్ ఖరీం, మాజీ వార్డు సభ్యుడు రాజు, రామకృష్ణ, శరత్ ఆధ్వర్యంలో సౌండ్‌బాక్స్ కొనుగోలు కోసం పాస్టర్ నవనీతంకు రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో బాబు, ఇమ్రాన్, అశోక్, మహేష్, వెంకటస్వామి పాల్గొన్నారు.

### పెన్షనర్లకు ఘన సన్మానం



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్టీఓ విజయ్‌కుమార్ హాజరై ఎనిమిది మంది రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా సహాయ సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, కృష్ణయ్య, విజయభాస్కర్, ఖరీం, రిటైర్డ్ ఎంప్లాయిస్ పాల్గొన్నారు.

### మాలధారులకు అన్నదానం



తెలకపల్లి: మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో హనుమాన్ మాల ధరించిన మాలధారులకు సర్పంచ్ సురేఖాబాలగౌడ్ ఆదివారం భిక్ష ఏర్పాటు చేశారు. ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత లభిస్తుందని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో స్వాములు పాల్గొన్నారు.

### గుప్త నిధుల కోసం వేట

అచ్చంపేట రూరల్: పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం ప్రాంగణంలో గుప్త నిధుల కోసం వేట కొనసాగించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఆలయ పరిసరాల్లోని శివాలయం వెనకభాగంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు మెటల్ డిటెక్టర్ పరికరంతో పరిశీలించారని, దీనిని కొందరు సెల్‌ఫోన్‌లో వీడియో తీశారని పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### దుప్పట్ల పంపిణీ



చారకొండ: మండలంలోని కమాల్‌పూర్ తండాకు చెందిన మూడావత్ కృష్ణ సంవత్సరం కిందట అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన జ్ఞాపకార్థం సోదరుడు సోదరుడు మూడావత్ గోపి తండావాసులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్ గౌడ్, బాల్‌రాం గౌడ్, భీముడు నాయక్, సర్పంచ్ శ్రీను, మోతీలాల్ తదితరులు ఉన్నారు.

### పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని పలువురు కాంగ్రెస్ పార్టీపై ఫేక్ వీడియోలు, రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ నాయకులు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఆందోళనలో ఆటో డ్రైవర్లు



మన్ననూర్ బస్టాండులో ప్రయాణికుల కోసం వేచిచూస్తున్న ఆటోడ్రైవర్లు



బస్సుల కోసం ఎదురుచూస్తున్న మహిళలు

మన్ననూర్: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తోంది. దీంతో ఆటోలలో ప్రయాణించేందుకు మహిళలు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఆటోవాలాలు గంటల తరబడి నిరీక్షించిన ఆటో ఎక్కేవారే లేకపోవడంతో ఆటోడ్రైవర్ల జీవితాలు దుర్భరంగా మారాయి. కనీసం కుటుంబపోషణకు కూడా డబ్బులు రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఉన్న ఉపాధి కూడా పోవడంతో ఏ చేయాలో తలలుపట్టుకుంటున్నారు. అమ్రాబాద్ మండలంలో సుమారు 80 మంది ఆటోలు, 30 వరకు జీపులు ఉన్నాయి. వచ్చిన ఆదాయంతో కుటుంబాలను పోషిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు కాకముందు ఆటోలు ఉదయం 6–7 గంటలకు ఆటో స్టాండులో సీరియల్‌లో పెట్టి మన్ననూర్ నుంచి అమ్రాబాద్, మన్ననూర్ నుంచి అచ్చంపేటకు ప్రయాణికులను చేరవేసేవారు. రోజులో ఒకటి రెండు ట్రిప్పులు మాత్రమే అవకాశం వచ్చేది. ఒక ట్రిప్పు డబ్బులు ఆటోకు డీజిల్, మెయింటనెన్స్ పోగా ఒక ట్రిప్పు డబ్బులు మిగిలితే అంతంత మాత్రంగా కుటుంబ పోషణకు ఉపయోగపడేది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాకా ఉన్న ఉపాధి కూడా పోయిందని ఆటోడ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. భార్య పిల్లలను ఎలో పోషించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఆటోలను ఫైనాన్స్ తీసుకున్నవారు నెల వారిగా ఫైనాన్స్ కిస్తీ డబ్బులు చెల్లించే వారికి తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

### ప్రభుత్వం ఆదుకోవాలి



వారం రోజుల నుంచి ఆటోలో ఎవరు ఎక్కడం లేదు. గంటల తరబడి నిరీక్షించినా ఉపయోగం లేకుండా పోతోంది. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సంవత్సరానికి రూ. 12 వేలు ఆర్థికసాయం అందజేయాలి. వెంటనే హామీని అమలు చేయాలి.

–మద్దెల శేఖర్, ఆటో డ్రైవర్, మన్ననూర్

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సాంస్కృతిక కార్యక్రమాలల్లో విద్యార్థులు

బిజినేపల్లి: వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. నవోదయ అలుమిని అసోసియేషన్ వట్టెం, నవోదయ విద్యాలయ సంయుక్త ఆధ్వర్యంలో 30 బ్యాచ్‌లకు సంబంధించిన పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఎక్కడెక్కడ స్థిరపడ్డారో అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత ఉపాధ్యాయులను వారు సన్మానించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. పూర్వ విద్యార్థులు విద్యాలయానికి టీవీలను, ప్రొజెక్టర్లను విరాళంగా అందజేశారు. ప్రిన్సిపాల్ భాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ జానకిరాములు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రంజిత్‌కుమార్, సభ్యుడు డాక్టర్ రాజేష్, సతీష్, జ్యోతి, ప్రవీణ్, గోవర్ధన్, రామకృష్ణ, అధ్యాపకులు భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



పరామర్శిస్తున్న వైస్ ఎంపీపీ గోవర్ధన్

కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మొగులాల్ మృతి చెందాడు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సూచనల మేరకు వైస్ ఎంపీపీ గోవర్ధన్ తర్నికల్ గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రుక్నుద్దీన్, సురేష్‌గౌడ్, శ్రీనివాసులు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి: పట్టణంలోని 17వ వార్డులో కృష్ణమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం ఎడ్మ కిష్టారెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ద్వారా రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. చైర్మన్ వెంట వైస్ చైర్మన్ షాహెద్, ప్రదీప్, దుర్గయ్య, దాసు, సత్యం, శ్యాంసుందర్ తదితరులు ఉన్నారు.

మన్ననూర్: కాంగ్రెస్ నాయకుడు, రైతు దాసరి గోపాల్(56) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న అమ్రాబాద్ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ సూచన మేరకు కాంగ్రెస్ ఎంపీటీసీలు రహీం, శ్రీనివాసులు, జిల్లా నాయకుడు వెంకటరమణ, రాజారాం బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు.

# ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



పరీక్షలు నిర్వహిసున్న వైద్యుడు

కొల్లాపూర్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కౌన్సిలర్ నయీమ్ పాషా అన్నారు. ఆదివారం పట్టణంలోని తొమ్మిదో వార్డులో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అపోలో డయాగ్నోస్టిక్ సిబ్బంది స్థానికులకు బీపీ, షుగర్ పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసేందుకు ముందుకువచ్చిన అపోలో డయాగ్నోస్టిక్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనారోగ్య సమస్యలకు గల కారణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

# విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు



కలశ పూజలో పాల్గొన్న భక్తులు



హోమంలో పాల్గొన్న దంపతులు

లింగాల: మండలంలోని అంబట్‌పల్లిలో నూతనంగా పున:నిర్మించిన శివాలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఆదివారం రెండోరోజు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఈ సందర్భంగా ఆలయం ఆవరణలో వేద మంత్రోచ్ఛరణల మధ్య దంపతులు హోమాలను నిర్వహించారు. విగ్రహాలకు జలావాస, ధాన్యాధివాసం నిర్వహించారు. నవగ్రహ, వాస్తుహోమాలను నిర్వహించి తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్నదానం ఏర్పాటు చేశారు.

**నేడు విగ్రహాల ప్రతిష్ఠ**

ఉత్సవాలలో భాగంగా సోమవారం విగ్రహమూర్తులు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గణపతి, శివలింగ, పార్వతి, నందీశ్వర, వీరభద్ర, కుమారస్వామి, నాగదేవత, శిఖరకలశ, ధ్వజస్తంభాలను ప్రతిష్ఠించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఘనంగా పూల వసంతం వేడుకలు

కొల్లాపూర్: పట్టణంలోని వరిదేల హనుమాన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పూల వసంతం వేడుకలు నిర్వహించారు. హనుమాన్ ఆలయం నుంచి పూలవసంతం వేడుకలు ప్రారంభించారు. స్థానికులు రంగులు చల్లుకుంటూ, భజన కీర్తనలు చేస్తూ ప్రధాన వీధుల గుండా తిరిగారు. అనంతరం ఆలయంలో హనుమాన్‌కు పూజలు నిర్వహించి, ఉత్సవాలకు ముగింపు పలికారు. కార్తీకమాసం ముగింపు సందర్భంగా శనివారం రాత్రి అఖండ భజనతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు జగదీశ్వర్, వేణాచారి, పెద్దరాజు, కృష్ణమనాయుడు, మురళి, రవి, నాగరాజు తదితరులున్నారు.

### మైసమ్మ జాతరలో భక్తుల రద్దీ

పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ దేవతను దర్శించుకునేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వానాకాలం పంట ధాన్యాన్ని విక్రయించిన అనంతరం రైతులు అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. దీంతో రైతులు, వ్యవసాయ కూలీలు మైసమ్మ దేవతను దర్శించుకున్నారు. పెబ్బేరు, వనపర్తి, గద్వాల, కొల్లాపూర్, అచ్చంపేట, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి ప్రైవేట్ వాహనాల్లో తరలివచ్చారు. మైసమ్మ జాతరలో ఏర్పాటు చేసిన తిను బండారాల స్టాళ్ల, ఇతర దుకాణాల వద్ద భక్తుల సందడి కనిపించింది.

### శ్రీనివాసాచారికి సన్మానం



తెలకపల్లి: మండలంలోని పెద్దపల్లి గ్రామానికి చెందిన కవి, శ్రీనివాసాచారిని శనివారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో కపిలవాయి లింగమూర్తి సాహిత్య పీఠం, తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో సన్మానించారు. కవిసమ్మేళనం అధ్యక్షుడు కపిలవాయి అశోక్‌బాబు, ఆచార్య కె వెంకట్ రెడ్డి, కవి ఎస్వీ రఘువీర్, ప్రతాప్, సమన్వయకర్త పెద్దూరు వెంకటదాసులు హాజరయ్యారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



ప్రమాదస్థలంలో కారు

చారకొండ: మండలంలోని జూపల్లిలో దేవరకొండ కల్వకుర్తి ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జంతుక రామదాసు రోడ్డు దాటుతుండగా కల్వకుర్తి నుంచి దేవరకొండ వైపు కారు వెళ్తోంది. కల్వకుర్తి ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్‌ను ప్రమాదవశాత్తు ఢీకొన్నది. కారు టైర్ పగిలి అదుపుతప్పి రామదాసును ఢీకొని హైమాస్ట్ స్తంభాన్ని తగిలి నిలిచింది. ఈ ప్రమాదంలో రామదాసుకు కుడి చేయి భుజం విరిగి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు బాధితుడిని ఆటోలో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. స్థానిక పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై ఎలాంటి పిర్యాదు అందలేదని ఎస్‌ఐ రవి తెలిపారు.

### హాజీపూర్ చౌరస్తాలో హై అలర్ట్...?

అచ్చంపేట రూరల్: అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక అందరూ ఊపిరి పీల్చుకున్న సందర్భంలో సోమవారం అచ్చంపేట మండలం హాజీపూర్ చౌరస్తాలో హై అలర్ట్‌గా కొనసాగనుంది. భారీ మెజార్టీతో గెలిచిన అధికార కాంగ్రెస్ పార్టీ ఊపు మీద ఉండగా, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఓటమి తర్వాత మొదటి సారిగా అచ్చంపేట నియోజకవర్గంలో సోమవారం రానున్నారు. ఉదయం 10గంటలకు హాజీపూర్ రానున్నారని సామాజిక మాధ్యమాల్లో కార్యకర్తలకు సమాచారం చేరవేశారు. అదే సమయానికి అధికార కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో కార్యకర్తలకు సమాచారం ఇచ్చారు. రెండు పార్టీలకు చెందిన సమావేశాలు ఒకే రోజు, ఒకే సమయానికి ఉండటంతో పోలీసులకు సవాలుగా మారింది. ఏ విధంగా కంట్రోల్ చేస్తారని పలువురిలో టెన్షన్ మొదలైంది. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉండగా డివిజన్‌లోని ఆయా పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఎమ్మెల్యే గువ్వల బాలరాజు రెకమండేషన్‌తో ఎస్‌ఐలు, సీఐ, డీఎస్పీ నియమితులయ్యారు. ఎన్నికల వేళ అధికార పార్టీకి పోలీసులు కొమ్ము కాశారని బాహాటంగానే ప్రచారం జరిగింది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పోలీసుల తీరు ఎలా ఉండనుందో అందరు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం వన్ సైడ్ చేసిన పోలీసులంతా అయిష్టంగానే అచ్చంపేటలో డ్యూటీలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. కాగా హాజీపూర్‌లో రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఒకే రోజు, ఒకే సమయంలో కలుస్తుండటంతో పోలీసులు ఏ విధంగా వ్యవహరిస్తారోనని పలువురు చర్చించుకుంటున్నారు.

# ఘనంగా అయ్యప్ప పడిపూజ



తాడూరులో ఊరేగింపులో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు



వెల్దండలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీచంద్‌రెడ్డి

వెల్దండ: మండలంలోని యెన్నమ్స్ ఆస్పత్రి ఆవరణంలో ఆదివారం అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమం నిర్వహించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఫుడ్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్‌లు వేర్వేరుగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరు భక్తిభావాన్ని వారు అలవర్చుకోవాలని కోరారు. అయ్యప్ప మాలధారులు భక్తి గీతాలను ఆలపించారు. సర్పంచ్ భూపతిరెడ్డి, నాయకులు మట్ట వెంకటయ్యగౌడ్, సంజీవ్‌కుమార్, అంజన్‌రెడ్డి, హరికాంత్‌రెడ్డి, అయ్యప్ప గురుస్వాములు తదితరులు ఉన్నారు.

తాడూరు: మండల కేంద్రంలోని కొమ్ముగుట్ట ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన పడిపూజ భక్తిపూజలతో కొనసాగింది. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారులు ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా సోమవారం నిర్వహించే మహాపడిపూజకు ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు హాస్యాస్పదం



మాట్లాడుతున్న రంగినేని జగదీశ్వరుడు

కొల్లాపూర్: మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని టీపీసీసీ నాయకులు రంగినేని జగదీశ్వరుడు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాముయాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో హర్షవర్ధన్‌రెడ్డి వత్తిడితో మంత్రి జూపల్లి కృష్ణారావు అనుచరులపై అనేక అక్రమ కేసులు పెట్టించారని వివరించారు. గ్రామాల్లో ప్రజలను వర్గాలుగా విభజించి పాలించారన్నారు. ఇటీవల మీడియా సమావేశంలో కొల్లాపూర్‌ను ప్రశాంతంగా ఉంచాలని హర్షవర్ధన్‌రెడ్డి కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు కొల్లాపూర్‌లో అల్లర్లు సృష్టిస్తే ఊపేక్షించమని హెచ్చరించారు. కౌన్సిలర్లు పిన్నంశెట్టి జ్యోతి, శ్రీలక్ష్మీయాదవ్, మేకల శిరీషయాదవ్, నాయకులు పసుపుల నర్సింహ్మా, శేఖర్‌రెడ్డి, వేణుగోపాల్‌యాదవ్, పరశురామ్‌నాయుడు, బి.బాలరాజు, సిరాజుద్దీన్, రఫియొద్దీన్, కాంతారావు తదితరులున్నారు.

# సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

కల్వకుర్తిరూరల్: రాష్ట్రంలో వివిధ స్కీంలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో కల్వకుర్తిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెరిగిన ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీ టీచర్లకు రూ.18 వేలు, మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.15 వేల వేతనం, ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్‌సీలు ఇవ్వాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. భవన నిర్మాణ సంక్షేమ కార్మికుల బోర్డుకు నిధులు విడుదల చేయాలని కల్వకుర్తిలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. శ్రీనివాసులు, బాలస్వామి, మాసమ్మ, బక్కయ్య, జయమ్మ, రఫీకా సుల్తానా, సుదర్శన్‌రెడ్డి, ప్రభాకర్, యాదయ్య పాల్గొన్నారు.

# ప్రారంభమైన ధనుర్మాస పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొల్లాపూర్: పట్టణంలోని దేవాలయాల్లో ఆదివారం నుంచి ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున నుంచే భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. రామమందిరంలో, బండాయి గుట్ట వేంకటేశ్వరస్వామి, మాధవస్వామి దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి, రంగనాథస్వామి విగ్రహాలకు అభిషేకాలు చేసి, ఫల, పుష్పాలు సమర్పించారు. శనివారం రాత్రి ఆలయాల్లో భజన కీర్తనలు ఆలపించారు.

### పూజారికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న వేణుగోపాల్

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ దేవాలయ ప్రాంగణంలో ఉన్న శివాలయంలో వేణుగోపాల్ పౌరోహిత్యం నిర్వహిస్తూనే గద్వాల పీజీ సెంటర్‌లో తెలుగు అధ్యాపకుడుగా వేణుగోపాల్ విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసిలో ఉత్తరప్రదేశ్ కాశీ హిందూ విశ్వవిద్యాలయం 103వ స్నాతకోత్సవంలో ఆయన డాక్టరేట్ పట్టా పొందారు. కాశీ హిందూ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య బూదాటి వెంకటేశ్వర్ల పర్యవేక్షణలో వేణుగోపాల్ తెలుగు సాహిత్యంలో సరస్వతీ పరిశీలన అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఆయనకు డాక్టరేట్ లభించడం పట్ల గద్వాల ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి, శ్రీనివాసులు, గోపినాథ్ రాథోడ్, భీంపల్లి శ్రీకాంత్, కల్వకుర్తి వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయ చైర్మన్ జూలూరి రమేష్ బాబు, ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కల్మిచర్ల రమేష్, కోశాధికారి శివ, జగదీశ్వర్, శ్రీధర్ తదితరులు వేణుగోపాల్‌ను అభినందించారు.

# ఖాళీ అవుతున్న సర్కార్ బడులు



మూతపడిన మంగళ్లపల్లి (నిజామాబాద్) ప్రాథమిక పాఠశాల

పాన్‌గల్: తొలిమెట్టు, బడిబాట వంటి ఎన్ని కార్యక్రమాలు అమలు చేస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గిపోతూ మూతపడుతున్నాయి. ఉన్న ఊరిలోనే చిన్నారులను ఓనమాలు దిద్దించి.. విద్యాబుద్ధులు నేర్పించి పైచదువులకు వెళ్లేలా తీర్చిదిద్దే పల్లె బడులు ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. ప్రైవేట్ వైపు మొగ్గు చూపుతున్న తల్లిదండ్రులను ఒప్పించి వారి పిల్లలను సర్కారు పాఠశాలల్లో చేర్పించడంలో విద్యాశాఖ అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా మండలంలో ప్రతి సంవత్సరం మూసివేస్తున్న పాఠశాలల సంఖ్య పెరుగుతూ వస్తోంది. మండలంలో మూత పడుతున్న పాఠశాలల వివరాలు.. కిష్టాపూర్, దావాజిపల్లితండా, మంగళ్లపల్లి(నిజామాబాద్) రేమద్దుల బీసీ కాలనీ, గన్యానాయక్ తండా, గురిగింజమిట్టా తండా ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. దీంతో పాటు మరికొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పదిలోపు ఉన్నాయి. అవి కూడా మూతపడే ప్రమాదం ఉందని ఇప్పటికైన విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.